క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

నాగారం : నాగారం మండలానికి ఆదివారం ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ రానున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి ఎమ్మెల్యే హాజరవుతున్నట్లు తెలిపారు.

బొమ్మగాని వెంకటయ్య మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ సీనియర్ నాయకుడు, గీత పనివారల రాష్ట్ర నాయకుడు బొమ్మగాని వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని వెంకటయ్య నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు అనంతుల మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, శాంతి సంఘం జిల్లా అధ్యక్షుడు తోగిటి మురళి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవి తదితరులు పాల్గొన్నారు.

బలగం సినిమా ప్రదర్శన

మద్దిరాల : గోరెంట్ల గ్రామంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం బలగం సినిమాను ప్రదర్శించారు. దీనికి ముందు గ్రామానికి చెందిన జలగం రామచంద్రన్–ఉషారాణి దంపతుల ఆధ్వర్యంలో డ్యాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేశారు. ప్రతిభ కనబర్చిన వారికి మొదటి, ద్వితీయ బహుమతులు అందజేశారు.

రంగస్థల నటుడికి సన్మానం



నటుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చివ్వెంల : సూర్యాపేట పట్టణానికి చెందిన, ప్రస్తుతం బీబీగూడెం గ్రామంలో నివాసం ఉంటున్న రంగస్థల నటుడు గంగుల సుబ్బారావును రాష్ట్ర విశ్రాంత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేష్, కల్లూరి నాగయ్యలతో పాటు, రంగస్థల నటుడు పేరాల సుధీర్‌లు మంగళవారం ఘనంగా సత్కరించారు. వర్ధమాన నటులకు శిక్షణ ఇస్తున్న ఆయనకు జ్ఞాపికలు అందజేశారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రచారం చేస్తున్న సిబ్బంది

సూర్యాపేటక్రైం : అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తతతో వ్యవహరిస్తే ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడవచ్చని సూర్యాపేట స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్.శ్రీనివాస్ అన్నారు.అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వెంటనే సమీప ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాలని, 101కి కాల్ చేయాలన్నారు. అనంతరం పాత బస్టాండ్, కల్నల్ చౌరస్తాలో ప్రజలకు అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. కర్తవ్య నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఎఫ్ కె.లింగయ్య, ఎఫ్ఎం. ఎ.శ్రీనివాసరావు, యాకూబ్, సత్యనారాయణ, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

నాగారం : నాగారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు శనివారం మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య సమక్షంలో బీజేపీలో చేశారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కదారి సుజాత, జమున, ఈశ్వరమ్మ, కమలమ్మ, మల్లమ్మ, సోమక్క, రాములమ్మ, పున్నమ్మ, భిక్షమమ్మ, అంజమ్మ, నర్సమ్మ, మలమ్మ, రుక్కమ్మ, సత్తమ్మ, సత్తయ్య, పద్మ, నర్సయ్యలతో పాటు పార్టీలో చేరిన మరో 50 మందికి కడియం రామచంద్రయ్య పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మొల్కపురి చిరంజీవి, రమేష్, సోమేష్ గౌడ్, దుర్గేష్, గిరిప్రసాద్, హన్మంతు, యాదగిరి, యాకస్వామి పాల్గొన్నారు.



బీజేపీలో చేరుతున్న కార్యకర్తలు

జాతీయ రహదారులే కల్లాలుగా..

- స్థలాలు లేకపోవడంతో హైవేలపైనే ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



365 హైవేపై ధాన్యం రాశులు



హైవేపై ఆరబోసిన ధాన్యం

అర్వపల్లి : యాసంగి వరి కోతలు ముమ్మరమయ్యాయి. దీంతో రైతులు వరికోత మిషన్‌లతో వరిపంట కోయించి ధాన్యాన్ని ఆరబోయడానికి హైవే రోడ్లను ఉపయోగించుకుంటున్నారు. హార్వెస్టర్లతో కోతల మూలంగా తేమశాతం ఎక్కువగా ఉంటుండటంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో హైవే రోడ్లను ఎంచుకొని రోడ్లపై ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. తమ పొలాలు, ఇళ్ల వద్ద ధాన్యం ఆరబోసుకోవడానికి సరిపోను స్థలాలు లేక రోడ్లపైనే ఆరబోయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అయితే ప్రభుత్వం ప్రతి రైతు తమ పొలాల వద్ద కల్లాలను ఏర్పాటు చేసుకోవాలని ఉపాధిహామీ పథకంలో ఉచితంగా కల్లాలను నిర్మిస్తోంది. కాగా రైతులు మాత్రం తమకున్న కొద్దిపాటి భూముల్లో కల్లాలు నిర్మించుకుంటే స్థలాలు చాలవనే భావనతో కల్లాలపై పెద్దగా దృష్టి సారించడం లేదు. దీంతో కల్లాలు నిర్మించుకోక, బయట స్థలాలు దొరక్క రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. దీంతో రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయి.

రెండు జాతీయ రహదారులపై ధాన్యం రాశులు..

జాజిరెడ్డిగూడెం మండలంలో రెండు జాతీయ రహదారులు ఉన్నాయి. ఇందులో సూర్యాపేట–జనగామ, నకిరేకల్–తానంచర్ల హైవేలు కాగా 365 హైవేపై జాజిరెడ్డిగూడెం నుంచి బొల్లంపల్లి వరకు, 365బీ హైవేపై తిమ్మాపురం నుంచి పర్సాయపల్లి వరకు పలుచోట్ల ధాన్యాన్ని ఆరబోశారు. అలాగే మరికొన్ని చోట్ల ధాన్యాన్ని రాశులు పోసి పట్టాలు కప్పి ఉంచారు. ధాన్యం ఆరబోసిన ప్రాంతాల్లో రైతులు ధాన్యాన్ని శుభ్రం చేసే పనులు కూడా చేస్తున్నారు. దీంతో ఈ రోడ్లపై వెళ్లే ప్రయాణికులు, వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

కల్లాలు నిర్మించుకోవాలి



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రైతులకు ఉచితంగా కల్లాలను నిర్మిస్తున్నాం. అయితే చాలా మంది రైతులు స్థలాలు చాలడం లేదనే కారణంతో నిర్మించుకోవడం లేదు. ప్రతిరైతు తమ వ్యవసాయ భూముల్లో కల్లాలను నిర్మించుకోవాలి.

– సీహెచ్. ఉపేందర్, ఏపీఓ, ఎంజీఎన్ఆర్ఈజీఎస్

రోడ్లపై ధాన్యం ఆరబోయవద్దు



మండల పరిధిలోని 365, 365బీ జాతీయ రహదారులపై రైతులు ధాన్యం ఆరబోయవద్దు. అత్యవసరమనుకుంటే రోడ్ల వెంట ఉండే వాహనాలు నిలిపే స్థలమైన ట్రక్ లే బేలో ఆరబోసుకొని వెంటనే తీసివేయాలి. అలాగే రోడ్లపై నిలబడి ధాన్యాన్ని శుభ్రం చేసే పనులు మానుకోవాలి. రోడ్లపై ధాన్యం పోయడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

– బి. అంజిరెడ్డి, ఎస్ఐ, అర్వపల్లి

క్రీడాకారులకు ఉచిత శిక్షణ ప్రారంభం



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

తిరుమలగిరి : క్రీడాకారులు శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత కోరారు. తొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌వీడీ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, ఎస్ఐ శివకుమార్‌లు శనివారం క్రీడాకారులకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఇస్లావత్ నవీన్, ప్రధానోపాధ్యాయుడు ధరావత్ వెంకట్, ఉపాధ్యాయులు రుబీనా, వాసుదేవమూర్తి, సైదులు, రహీం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ



నాగారంలో వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కడియం రామచంద్రయ్య

నాగారం : నాగారం మండల కేంద్రంలో మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య శనివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాగారంలోని జెడ్పీహెచ్ఎస్ పక్కన ప్రభుత్వ భూమిలో గతంలో వాటర్ ట్యాంక్ ఉండేదని, శిథిలావస్థకు చేరడంతో దానిని తొలగించారని అన్నారు. అదే ప్రభుత్వ భూమిలో గ్రామపంచాయతీ అనుమతి ఇస్తే తన సొంత నిధులతో కడియం సోమక్క చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మేడబోయిన యాదగిరి, మండల అధ్యక్షుడు మొల్కపురి చిరంజీవి, నాయకులు గిరిప్రసాద్, హన్మంతు, అనంతుల సోమేష్‌గౌడ్, మంగదుడ్ల రమేష్, నాగు వెంకన్న, కదారి సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



వెంపటిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న యాదవ సంఘం నాయకులు

తుంగతుర్తి : యాదవుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని సర్పంచ్ అబ్బగాని పద్మసత్యనారాయణ అన్నారు. యాదవులకు రెండో విడత గొర్రెల పంపిణీ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం వెంపటి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి మాట్లాడారు. యాదవులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని చేపట్టిందన్నారు. కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గుండగాని వీరస్వామి, బీఆర్ఎస్ నాయకులు దేశబోయిన హరీష్, తునికి సాయిలు, రచ్చ నవీన్, తొప్పెట్ల ఎల్లయ్య, భిక్షం, ఇరుగు మురళి, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ రిఫ్రిజిరేటర్ బహూకరణ



వాటర్ రిఫ్రిజిరేటర్‌ను బహూకరిస్తున్న దాత గొలుసుల వెంకన్న

తిరుమలగిరి : తొండ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల దాహార్తిని తీర్చడానికి గ్రామానికి చెందిన బాలాజీ స్టోన్స్ క్రషర్ యజమాని గొలుసుల వెంకన్న వాటర్ రిఫ్రిజిరేటర్‌ను శనివారం పాఠశాలలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారాలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి శాంతయ్య, హెచ్ఎం కె.అశోక్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ స్పందన సైదులు, ఉపాధ్యాయులు మురళీ, అనితాకుమారి, జానిబేగం పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం సబ్ మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ



ఆత్మకూర్ (ఎస్) : నసీంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్



చివ్వెంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్

అర్వపల్లి : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్, జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జాజిరెడ్డిగూడెం వ్యవసాయ సబ్‌మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన గోపాలకృష్ణ మాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంభం ఉషారాణినాగరాజు, నిర్వాహకులు లొడంగి నాగరాజు, కుంభం నాగరాజు, లింగమల్లు, అజాద్, నాగరాజు, ఎన్. యాదయ్య, మార్కెట్ డైరెక్టర్ బి. వెంకన్న, హరిప్రసాద్, కొప్పుల సోమిరెడ్డి, కోటమర్తి మల్లయ్య, శ్రీను, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నసీంపేటలో మ్యాక్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముల్కలపల్లి రవిమాదిగ, తుమ్మల పెన్‌పహాడ్ ఎంపీటీసీ ఉప్పుల మల్లయ్య, కన్నయ్య, నర్సింహారావు, గుండా నాగరాజు, మధు, హన్మయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గంధం నర్సయ్య పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చివ్వెంల : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంతోపాటు ఐలాపురం, గుర్రంతండా, వట్టిఖమ్మంపహాడ్, లక్ష్మణ్ నాయక్ తండా, బద్యాతండా, తుల్జారావుపేట, తిమ్మాపురం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. ఆరబెట్టిన, నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, వ్యవసాయ అధికారి ఆశాకుమారి, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు, సీఈఓ శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచ్‌లు బోడపట్ల సునీత, ధరావతు సుజాత, బానోతు క్రాంతి, జాల మానస, దొంగరి కోటేశ్వర్‌రావు, సుంకరి లక్ష్మమ్మ, బానోతు బీకారి, ధరావతు సుశీల, సాగర్, నిర్వాహకులు ఉప్పోజు కోటేశ్వరి, రమ్యశ్రీ, జానకి, పార్వతి, యేలేంద్ర, భద్రమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

పత్తాలేని ఆరోగ్య పరిరక్షణ కిట్లు!

- మూడేళ్లుగా నిలిచిపోయిన సరఫరా
- విద్యార్థినులకు తప్పని ఎదురుచూపులు



హెల్త్‌కిట్‌లో ఉండే వస్తువులు(ఫైల్)

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందించే హెల్త్‌కిట్లు గత మూడేళ్లుగా రాకపోవడంతో వారికి ఎదురు చూపులు తప్పడం లేదు. చివరగా 2019 డిసెంబర్‌లో హెల్త్‌కిట్లను అందజేశారు. తరువాత 2020 మార్చిలో కరోనా కారణంగా పాఠశాలలు మూతపడటంతో ఆరోగ్య పరిరక్షణ కిట్ల సరఫరా నిలిచిపోయింది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ముగుస్తున్నా నేటికీ విద్యార్థినులకు హెల్త్‌కిట్లు రాలేదు. ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు మూడు నెలలకు ఒకసారి ఏడాదికి 4సార్లు(వేసవి సెలవుల్లోకూడా) జూలై, అక్టోబర్, జనవరి, ఏప్రిల్ నెలల్లో హెల్త్‌కిట్లను పంపిణీ చేయాల్సి ఉంది. మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో 1 ప్రాథమికోన్నత, 1 ఆదర్శ పాఠశాల, 1 కేజీబీవీ, 6 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 1,165 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. హెల్త్‌కిట్‌లో ఉండే వస్తువులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. కానీ మూడేళ్లుగా హెల్త్‌కిట్లు ఇవ్వకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు.

కిట్లలో ఉండే వస్తువులు ఇవే..

ప్రభుత్వం బాలికల ఆరోగ్య సంరక్షణకు అందించే హెల్త్‌కిట్‌లో 11 రకాలైన వస్తువులను పంపిణీ చేస్తోంది. వీటిలో పతాంజలి, డాబర్, జాన్సన్ అండ్ జాన్సన్, ఐటెక్స్ వంటి కంపెనీలకు చెందిన బ్రాండెడ్ వస్తువులు, మూడు ఒంటి సబ్బులు, మూడు బట్టల సబ్బులు, ఒక టూత్‌బ్రష్, కొబ్బరినూనె బాటిల్, షాంపు బాటిల్, టూత్‌పేస్ట్, శానిటరీ న్యాప్కిన్స్, పౌడర్‌డబ్బా, బొట్టుబిళ్లలు, ఒక దువ్వెన, రెండు రబ్బర్లు, రెండు రిబ్బన్లను పాందుపర్చి హెల్త్‌కిట్ ద్వారా బాలికలకు అందిస్తారు.

ఇబ్బందులు పడుతున్నాం



ప్రభుత్వం అందించే ఆరోగ్య పరిరక్షణ కిట్లు మూడేళ్లుగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. హెల్త్‌కిట్‌లో ఉండే వస్తువులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. పాఠశాలలు ముగిసేలోపు విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణ కిట్లు అందేలా చూడాలి.

– షేక్.అస్లాతబసుమ్, విద్యార్థిని, పసునూర్, మోడల్‌స్కూల్

హెల్త్‌కిట్లు రాగానే పంపిణీ చేస్తాం



విద్యార్థినులకు అందించే ఆరోగ్య పరిరక్షణ కిట్లు ప్రభుత్వం నుంచి మంజూరు కాలేదు. కరోనా కాలం నుంచి పాఠశాలలకు హెల్త్‌కిట్ల సరఫరా నిలిచిపోయింది. ప్రభుత్వం నుంచి హెల్త్‌కిట్లు మంజూరైతే విద్యార్థులకు అందజేస్తాం.

– బి.బాలునాయక్, ఎంఈఓ, నాగారం

రోడ్డుమధ్యలో ప్రమాదకరంగా గుంతలు



నీరు నిలవడం వల్ల దెబ్బతింటున్న బీటీరోడ్డు



ఆత్మకూరు–తుమ్మల పెన్‌పహాడ్ మధ్య వాగు వద్ద ఏర్పడ్డ గుంతలు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్–ఆత్మకూరు గ్రామాల మధ్య వాగు వద్ద గుంతలు ప్రమాదకరంగా మారాయి. మండల కేంద్రమైన ఆత్మకూరుకు తుమ్మలపెన్‌పహాడ్, కోటపహాడ్, శెట్టిగూడెం, అస్లాతండా తదితర గ్రామాల ప్రజలు ఈ రోడ్డు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. అదే విధంగా తుమ్మలపెన్‌పహాడ్ రైతులు ఈ రోడ్డు గుండానే తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్తుంటారు. ఆత్మకూరు ఎక్స్ రోడ్డు నుంచి తుమ్మలపెన్‌పహాడ్ వరకు దాదాపు 4 కిలో మీటర్లకుగాను సగం వరకు బీటీ రోడ్డు వేశారు. సగం రోడ్డు ఆత్మకూరు రెవెన్యూ పరిధిలో బీటీగా మారలేదు. దీంతో ఆ రహదారిపై ప్రయాణం సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా రహదారిపై వాగుపై నిర్మించిన బ్రిడ్జి వద్ద ఇటీవల రెండు చోట్ల గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. రాత్రి పూట ప్రయాణం సాగించేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాక్టర్లు, ఆటోలు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి వెంటనే గుంతలను పూడ్చివేయాలని రైతులు కోరుతున్నారు.

మిషన్ భగీరథ లీకేజీ నీటితో దెబ్బతింటున్న రోడ్డు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం నుంచి తుంగగూడెం వెళ్లే దారిలో జాజిరెడ్డిగూడెం శివారులో మిషన్ భగీరథ పైపు నుంచి నీరు లీకేజీ అవుతోంది. దీంతో రోడ్డుపై నీరు నిలిచి బీటీ దెబ్బతింటుంది. లీకేజీ అయిన చోట బీటీ రోడ్డుపై నీరు చేరి గుంత ఏర్పడి మడుగులా మారింది. దీంతో వాహనచోదకులు ఈ ప్రదేశంలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. నీటి లీకేజీని అరికట్టాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా నీటి లీకేజీని అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



సూర్యాపేట రూరల్ : మాట్లాడుతున్న ఎంపీపీ



పెన్‌పహాడ్ : మాట్లాడుతున్న ఎంపీపీ

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి వైద్యసిబ్బందికి సూచించారు. శనివారం కాసరబాద గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహించిన జనారోగ్య సమితి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్య సేవలను విస్తృతంగా అందించాలన్నారు. ప్రజలకు స్వచ్ఛత పరిశుభ్రతపైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, వైద్యాధికారిణి స్రవంతి, సర్పంచ్ కొల్లు రేణుక, ఎంపీటీసీ బంటు నాగమ్మ, అధికారులు నాగమణి, దుర్గారెడ్డి, ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి

పెన్‌పహాడ్ : ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేసి ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వైద్యసిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య పరీక్షలు నిర్వహించాలని, రోగాల బారి నుంచి వారిని కాపాడాలని కోరారు. ఆస్పత్రిలో రోగుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక వసతులను పెంపొందించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, మండల వైద్యాధికారి స్రవంతి, ఎంపీటీసీ మామిడి రేవతిపరందాములు తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : మాట్లాడుతున్న సర్పంచ్

ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలి

నూతనకల్ : ప్రతి ఒక్కరి ఆరోగ్య సంరక్షణకు వైద్య సిబ్బంది కృషి చేయాలని సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అభివృద్ధి సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య సౌకర్యాలు కల్పించే విధంగా ప్రజలను చైతన్యపర్చాలని ఆమె కోరారు. ఆస్పత్రిలో మందుల నిల్వలు, రోగుల వైద్య సేవల కోసం సిబ్బంది చేపట్టాల్సిన చర్యలను చర్చించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్, మండల వైద్యాధికారి అశ్రితారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజులతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

సూర్యాపేటటౌన్ : ఎన్జీటీఎస్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో అక్షర ఫౌండేషన్, మాన్యాస్ పబ్లికేషన్స్ సంయుక్త సహకారంతో పదో తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్, ఆర్‌జేసీల్లో ప్రవేశాలకు సంబంధించి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్‌ను ఈ నెల 17 నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎన్జీటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాస రాంకుమార్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పాఠశాలల్లో పదవ తరగతి పూర్తి చేసుకున్న ఇంగ్లిష్, తెలుగు మీడియం విద్యార్థులు ఈ పాలిటెక్నిక్ కోచింగ్‌కు అర్హులని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, రచయితలచే ఆన్‌లైన్ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9000305079ను సంప్రదించాలని కోరారు.

జ్యోతిబాపూలే విగ్రహాన్ని స్వచ్ఛందంగా ఏర్పాటు చేస్తాం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామంలో ఆరాధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు తాడోజు శ్రీకాంత్‌రాజ్ తెలిపారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం రాత్రి కాసర్లపహాడ్ గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. అలాగే పేదలకు సాయమందించారు. త్వరలో గ్రామంలో పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతిరాణి, బొడ్డు రామలింగయ్య, మచ్చ నర్సయ్య, బైరబోయిన సైదులు, ఆచారి, లింగరాజు, ఆరాధ్య ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతిపత్రం అందజేత



పెన్‌పహాడ్ : ఎంపీపీకి వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



నాగారంలో ఎంపీఓకు సమ్మె నోటీసులు అందజేస్తున్న కార్యదర్శులు

పెన్‌పహాడ్ : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ సెక్రటరీ (జేపీఎస్)లను రెగ్యులరైజ్ చేయాలని, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్యదర్శులను జేపీఎస్‌లుగా మార్చాలని శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మాట్లాడారు. 2019లో తాము జేపీఎస్‌లుగా నియమితులమయ్యామని, దీంతో మా ప్రొబేషనరీ కాలం పూర్తయిందని తెలిపారు. ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా పరిగణించి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, సతీష్, సంజయ్, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

నాగారం : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న జూనియర్ పంచాయతీ సెక్రటరీలను రెగ్యులర్ చేసి, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్యదర్శులను జేపీఎస్‌లుగా మార్చాలని మండలంలో పనిచేస్తున్న పలువురు జేపీఎస్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ ధార శ్రీనివాస్‌కు సమ్మె నోటీసులు అందజేసి మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషన్ పీరియడ్ ఈ నెల 11తో ముగిసినా ప్రభుత్వం నుంచి ఎలాంటి రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు రాలేదని అన్నారు. ఈ విషయమై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మెకు వెళ్తున్నట్లు వారు తెలియజేశారు. జేపీఎస్‌లను రెగ్యులర్ చేస్తూ జీఓ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గడిచిన 4ఏళ్ల ప్రొబేషన్ కాలన్ని సర్వీసు కాలంగా గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేపీఎస్‌లు కొమ్ము అరుణ్, వీరేందర్, భవాని, శ్రీను, వెంకటేష్, జిందగిరి, సంతోష్, శివ, అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.